క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సునర్ల కాలనీ, ఏపీపీసీబీ కాలనీ, గాంధీనగర్ జయప్రకాష్‌నగర్, గవర వీధి, రెడ్డి వీధి, ఎన్ఏడీ మెయిన్ రోడ్డు, ఇందిరాప్రియదర్శిని నగర్, లక్ష్మీనగర్, బుచ్చిరాజుపాలెం ఎస్సీ కాలనీ, సీతారామరాజునగర్, లక్ష్మీనగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

మర్రిపాలెం సెక్షన్ పరిధిలో..

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధి ఈపీఎఫ్, కరాసా, రైల్వే క్వార్టర్స్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మర్రిపాలెం వుడా లేఅవుట్, లీడర్ ప్రెస్ ఏరియా, శివశివాని పాఠశాల, పోలీస్ క్వార్టర్స్, ఈపీఎఫ్ క్వార్టర్స్, ఓల్డ్ కరాసా, న్యూ కరాసా, రైల్వే క్వార్టర్స్, మర్రిపాలెం ప్రధాన రహదారి, గవర వీధి, గొల్ల వీధి, రాణాప్రతాప్ నగర్, శ్రీనివాస నగర్, హుస్సేన్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

గణపయ్యకు దీపారాధన



కోనేరులో దీపాలు వెలిగిస్తున్న పార్వతీనగర్ భక్తులు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులో వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పార్వతీనగర్‌లో సుప్రీంబాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండప వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నాలుగో రోజు గురువారం మండప ప్రాంగణంలో తాత్కాలిక కోనేరు ఏర్పాటు చేశారు. దానిలో అనేక మంది స్థానిక భక్తులు దీపాలు వదిలి వినాయకుడిని ఆరాధించారు.

కొత్తపాలెంలో అన్న సమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆళ్ల పైడిరాజు

గోపాలపట్నం: కొత్తపాలెంలో గణేష్ మండపం వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు ప్రారంభించారు. సుమారు 3వేల మంది భక్తులు, స్థానికులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు. మండప నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం

ఉక్కునగరం: వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ఓబీసీ ఉద్యోగులు, వారి కుటుంబీకులను స్టీల్ ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సత్కరించింది. స్టీల్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించిన ఉద్యోగులు, వారి కుటుంబీకులను సత్కరించారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎంలు జి.గాంధీ, డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, జీఎంలు ఎం.మధుసూదనరావు, వై.చంద్రశేఖర్, లైజన్ ఆఫీసర్ జి.అప్పారావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, రామస్వామి, కారు రమణ, వై.మస్తానప్ప, ఓబీసీ సంఘం నాయకులు బి.అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, కోయిలాడ శ్రీనివాసరావు, వై.ఎల్. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితుడు గురజాడ



రచయిత గద్వాల సోమన్నను గురుజాడ స్ఫూర్తిరత్న బిరుదుతో సత్కరిస్తున్న రవీంద్రుడు తదితరులు



గోపాలపట్నం గ్రంథాలయంలో గురజాడకు నివాళులర్పిస్తున్న ఓంకార మూర్తి, నరసింహం, పాఠకులు

మహాకవి జయంత్యుత్సవంలో సాహితీవేత్తలు

గోపాలపట్నం: మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు సమాజ హితుడని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, కవి సిహెచ్.చిన సూర్యనారాయణ అన్నారు. గురజాడ ఫౌండేషన్(అమెరికా) విశాఖ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఎన్ఏడీ రామకృష్ణ స్కూల్‌లో గురజాడ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ చైతన్యం కోసం గురజాడ రచనలు ఎక్కువగా చేశారన్నారు. వాటిని అందరూ చదవాలని, పాఠశాలల్లో ఆ సౌకర్యం కల్పించాలని సూచించారు. పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, కన్యాశుల్కం, కన్యక మొదలగు రచనల్లోని పాత్రలు సమాజంలో మనకు తారసపడినవేనన్నారు. రచయిత, కవి, అమరావతి విశ్వ సాహితి పురస్కార గ్రహీత పి.ఎల్.వి.ప్రసాద్ మాట్లాడుతూ కన్యాశుల్కం నాటకంలోని పాత్రలు, వాటి విశిష్టతలను వివరించారు. గురజాడ ఫౌండేషన్(అమెరికా) విశాఖ శాఖ అధ్యక్షుడు జి.వి.రవీంద్రుడు మాట్లాడుతూ నేటితరం పిల్లలు గురజాడ భావజాలాన్ని అందివ్వాలని ఆకాంక్షించారు.

పురస్కారాల ప్రదానం

ఈ సందర్భంగా కర్నూలుకు చెందిన రచయిత, గణిత ఉపాధ్యాయుడు గద్వాల సోమన్నను ఘనంగా సత్కరించి గురజాడ స్ఫూర్తిరత్న బిరుదు ప్రదానం చేశారు. గురజాడ సాహిత్యంపై అధ్యయనం చేసిన చెరుకూరుకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ మోదుగుల సుబ్బారావుకు అధ్యాపక రత్న పురస్కారం అందించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన చేబ్రోలు చెందిన గుటాల రాధిక శివసత్యశ్రీకి విద్యా రత్న పురస్కారం అందజేశారు. రామకృష్ణ స్కూల్ విద్యార్థులు గురజాడ అప్పారావు రచనలు, జీవిత విశేషాలపై చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో గురజాడ జయంతి

సాంఘిక అసమానతలపై విశేష కృషి చేసిన తెలుగు కవుల్లో గురజాడ అప్పారావు మొదటి వ్యక్తని రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఘంటసాల ఓంకార మూర్తి అన్నారు. గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో గురజాడ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం మాట్లాడుతూ తెలుగు సాహిత్యాభివృద్ధికి గురుజాడ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పాఠకులు వెంకటేశ్వరరావు, దుమ్ము ఓంకార్, ఒమ్మి బాలాజీ, మురళీ, చరణ్, షర్మిల, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్



కేక్ కట్‌చేస్తున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: ఇటీవల రాష్ట్ర క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నుంచే పరిపాలన సాగుతుందని ప్రకటించడంతో విశాఖలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం ఎన్ఏడీ సమీప 52వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయదశమి నుంచి పరిపాలన సాగిస్తామని ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీపీఎస్‌పై ఆమోదం పొందడం మంచి విషయమన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు శుభవార్తని పేర్కొన్నారు. కార్యక్రమంలో జియ్యాని విజయ్, వెంకటరమణ, నారాయణమ్మ, అనూరాధ, ధనలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



మృతుడి కుటుంబానికి బీమా సొమ్ము అందిస్తున్న కార్పొరేటర్ సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు బర్మా కాలనీకి చెందిన బండారు శివతులసీకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి గురువారం కార్పొరేటర్ పి.వి.సురేష్ వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేశారు. తులసీకుమార్ అనారోగ్యంతో మరణించడం బాధాకరమని, ఆ కుటుంబానికి తక్షణ సాయంగా బీమా నగదు అందించామని, మిగిలిన సొమ్ము బ్యాంకు ఖాతాలో జమవుతుందని సురేష్ తెలిపారు. స్థానిక వలంటీర్లు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



గొల్లవీధిలో గణనాథుడిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ సుధ



ప్రకాష్‌నగర్‌లో బుజ్జి గణపయ్య

మల్కాపురం: వినాయక నవరాత్రుల సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులకు నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి వద్ద యాదవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక విగ్రహాన్ని కార్పొరేటర్ కొణతాల సుధ గురువారం దర్శించుకున్నారు. భజనబృందం ఆలపించిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. యాదవ్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- ప్రకాష్‌నగర్ వద్ద స్థానిక యువత ఏర్పాటు చేసిన మండపంలో వేంకటేశ్వర స్వామి ఒడిలో గణనాథుడు కూర్చున్నట్లుగా రూపొందించిన విగ్రహం ఆకట్టుకుంటోంది. నార్త్ ఇండియన్స్ అధిక సంఖ్యలో వచ్చి ఒకేసారి బాలాజీకి, గణపతికి పూజలు చేస్తున్నారు.
- 59వ వార్డు ఎక్స్ సర్వీస్ మెన్ కాలనీ వద్ద స్థానిక క్రేజీ గైస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో స్వామిని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ దర్శించుకున్నారు. స్వామికి పంచామృతాలతో పూజలు చేశారు.
- 61వ వార్డు తెలకలవీధి వద్ద ఏర్పాటు చేసిన మండపం వద్ద గురువారం సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని, గణనాథుడిని అర్చించారు.

డీఎల్‌సీసీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ ఉష



ఉషను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు డాక్టర్ పి.ఉష డిస్ట్రిక్ట్ లెవెల్ లోకల్ కంప్లైంట్స్ కమిటీ(డీఎల్‌సీసీ) చైర్‌పర్సన్‌గా రెండో సారి నియమితులయ్యారు. ఈమె ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. ఈమెతోపాటు ఇతర సభ్యులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మహిళలు పనిచేసే స్థలంలో లైంగిక వేధింపులు సంబంధిత ఫిర్యాదులపై ఈ కమిటీ విచారణ చేస్తుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఉషను ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అదనపు డీసీపీ శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో గురువారం ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ(ట్రాఫిక్) జి.శ్రీనివాసరావు విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చని చెప్పారు. దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని, వాహనాలు నడిపేటప్పుడు యువత ఎంతో జాగ్రత్త వహించాలని సూచించారు. పిల్లలకు ఏ చిన్న ప్రమాదం సంభవించినా వారి తల్లిదండ్రుల జీవితం అగమ్యగోచరం అవుతుందని గుర్తించాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకుని తమకు భరోసాగా ఉండాల్సిన పిల్లలు ప్రమాదాల్లో గాయాలపాలై తల్లిదండ్రులకు భారం కాకూడదన్నారు. ఏవీఎన్ కళాశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు ప్రపంచంలో అత్యున్నత స్థాయిలో ఉన్నారని, వారిని నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రయత్నాలు సాగిస్తూనే ఉండాలన్నారు. ఇంటర్, డిగ్రీ చదువుతున్న సమయంలోనే వృత్తి నైపుణ్య శిక్షణ, భాషా పరిజ్ఞానం పెంపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. హార్బర్ సర్కిల్ ట్రాఫిక్ సీఐ జి.ఆర్.కె.తులసీదాస్ మాట్లాడుతూ రోడ్లపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఇంగ్లిష్ విభాగాధిపతి పైడి రజని, సురేషబాబు, యేసయ్య, అప్పారావు, వినీత, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్థ విజయంలో ఉద్యోగులు కీలకం

ఉక్కునగరం: సంస్థల విజయం అందులో ఉద్యోగులపై ఆధారపడి ఉంటుందని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో క్వాలిటీ సర్కిల్స్ చాప్టర్ కన్వెన్షన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఉక్కు మల్టీపర్పస్ హాలులో ఏర్పాటు చేసిన కన్వెన్షన్‌లో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో క్వాలిటీ సర్కిల్స్, ఫైవ్ ఎస్, సిక్స్ సిగ్మా కాన్సెప్టులు అధిక ప్రాధాన్యం కలిగి ఉన్నాయన్నారు. షిప్‌యార్డ్ డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ కమర్షియల్) ఎస్.వి. రాంబాబు మాట్లాడుతూ ఉత్పాదకత, నాణ్యత, వ్యయం, భద్రత, వినియోగదారుల సంతృప్తి, జట్టు కృషిపై ప్రభావం చూపేందుకు క్వాలిటీ సర్కిళ్ల తోడ్పాటు ప్రత్యేక సాధనమన్నారు. స్టీల్ ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం, చాప్టర్ చైర్మన్ జి.గాంధీ, డాక్టర్ జీఎం కమోడర్ సంజయ్‌కుమార్, చాప్టర్ కార్యదర్శి సాగర్ ప్రసంగించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ దారుణం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలో పెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం అత్యంత దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 952వ రోజు సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కార్మికులు తలచుకుంటే ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వదిలి కార్మికులకు అండగా నిలబడాలని కోరారు.

స్యూయింగ్ మెషీన్ ఆపరేటర్ శిక్షణకు ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ టెక్స్‌టైల్స్ అండ్‌హ్యాండ్‌లూమ్స్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా స్యూయింగ్ మెషీన్ ఆపరేటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ ఖాదీబోర్డు, అపెరల్ పార్క్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్.వి.పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు 35ఏళ్ల లోపు మహిళలు మాత్రమే అర్హులని, 7వ తరగతి ఆ పైన చదివి ఉండాలని తెలియజేశారు. 45 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఎంఎస్, వైజాగ్ అపెరల్ పార్క్ ఫర్ ఎక్స్‌పోర్ట్, వడ్లపూడిలో నేరుగా లేదా 97034 24768, 92930 57305కు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

డెంగ్యూపై అప్రమత్తత అవసరం



నీటి నిల్వలు తనిఖీ చేస్తున్న ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్

పెదగంట్యాడ: డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. జీవీఎంసీ 64వ వార్డు కొత్తదిబ్బపాలెంలో గురువారం పర్యటించిన ఆయన పర్యటించారు. ఈ ప్రాంతంలో డెంగ్యూ కేసులు నమోదు కావడంతో అప్రమత్తమైన అధికారులు స్థానికులకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో మాట్లాడుతూ దోమల కారణంగా డెంగ్యూ జ్వరం వ్యాప్తి చెందుతుందన్నారు. ఇళ్లలో నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులను వ్యాప్తి చేస్తాయన్నారు. వారంలో రెండు రోజులు డ్రై డే పాటించాలన్నారు. చెత్తను రోడ్డుపై వేయకుండా, ఇళ్ల వద్దకు వచ్చే శానిటరీ సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి యాదవుల కృతజ్ఞతలు



వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న పుర్రె సురేష్‌యాదవ్, పుర్రె అప్పారావు యాదవ్

మల్కాపురం: విశాఖ జిల్లా యాదవ సంఘానికి శాశ్వత భవనం ఏర్పాటుకు ఎండాడ వద్ద సుమారు 50 సెంట్ల భూమిని ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై జిల్లాలోని యాదవ సామాజిక వర్గీయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని గురువారం విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం యువత అధికార ప్రతినిధి పుర్రె సురేష్‌యాదవ్, యాదవ సంఘం ప్రతినిధి పుర్రె అప్పారావు యాదవ్, పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డులకు చెందిన యాదవ సంఘాల సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంత కాలం ఏ ప్రభుత్వం తమకు ఇంత ప్రాధాన్యం ఇవ్వలేదని, జిల్లాలో అనేక పదువులతోపాటు జిల్లా సంఘానికి స్థలం కేటాయించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ప్రజా సేవే పరమావధి



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: ప్రజా సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్ కుమార్ అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నానని చెప్పారు. 59వ వార్డు ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్ యాదవ్‌తో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు గెలిపించిన పశ్చిమ ఎమ్మెల్యే జైలులో ఉన్న ప్రతిపక్షనేత చంద్రబాబుకు జేజేలు కొడుతూ కాలక్షేపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాను ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఆలోచనతో అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తూ వస్తున్నానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో పేదలు ఆర్థికంగా ఎదుగుతూ ఆనందంగా జీవిస్తున్నారని చెప్పారు. సీఎం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని స్థానికులను ఆదారి అభ్యర్థించారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్ యాదవ్, పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న చెల్లూరి

ఆశ్రమానికి వృద్ధుడి అప్పగింత



అప్పారావును వృద్ధాశ్రమానికి అప్పగిస్తున్న చెల్లూరి భాస్కర్‌రావు

మల్కాపురం: కన్నకొడుకుల ఆదరణకు నోచుకోక.. శ్మశానవాటిక వద్ద జీవిస్తున్న ఓ వృద్ధుడి దీన స్థితిని గమనించి వృద్ధాశ్రమంలో చేర్పించి చిత్రకారుడు, సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కర్‌రావు తన మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలిలా.. శ్రీహరిపురానికి చెందిన అప్పారావు అనే 62 ఏళ్ల వృద్ధుడికి ఇద్దరు కుమారులు. వారు తండ్రిని పట్టించుకోకపోవడంతో ఆయన కోరమాండల్ వద్ద గల శ్మశానవాటికను నివాసంగా మార్చుకుని సమాధుల వద్ద పెట్టే పదార్థాలను భుజిస్తూ కాలం వెల్లదీస్తున్నాడు. విషయం తెలుసుకున్న చెల్లూరి భాస్కర్‌రావు గురువారం ఉదయం అప్పారావు వద్దకు వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. అనంతరం మల్కాపురం ఎస్ఐ దేవుడమ్మకు సమాచారం అందించారు. ఆమె అక్కడికి వచ్చి వృద్ధుడి వద్ద వివరాలు సేకరించి ద్విచక్ర వాహనంపై స్థానిక వృద్ధాశ్రమానికి తరలించారు. వసతి గృహ అధికారులకు అప్పారావును చెల్లూరి అప్పగించారు. ఆయన పలువురు అభినందించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



పొలమరశెట్టి సంజయ్ (ఫైల్ ఫొటో)

గోపాలపట్నం: కుటుంబ కలహాలతో రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పద్మనాభనగర్ ఎస్సీబీసీ కాలనీ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సీ బీసీ కాలనీ వద్ద నివాసముంటున్న పొలమరశెట్టి సంజయ్(38) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నాళ్లు రేషన్ పంపిణీ చేసే వాహనాన్ని నడిపేవాడు. ఇటీవల కుటుంబంలో కలహాలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు వెదకగా రైల్వే ట్రాక్‌పై మృతి చెందడం గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతునికి తండ్రి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేస, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి గురువారం నిర్వహించే సహస్ర తులసీదళార్చనలో రూ.1,500 చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో 32 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తులు రూ.1,000 చెల్లించి ఈ సేవలో పాల్గొనవచ్చు. పరోక్ష పద్ధతిలో పాల్గొనాలనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో పూజా రుసుం చెల్లించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు సత్యరూపవాణి, బి.అనురాధ, సుబ్రహ్మణ్యం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి పవిత్రోత్సవాలు

అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 24 నుంచి 27 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఈ నెల 26న ఉదయం 9 గంటల నుంచి 27వ తేదీ ఉదయం 11 గంటల వ రకు అంతరాలయ దర్శనాలు, పంచామృతాభిషేక సేవలు నిలుపుదల చేయనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

ఉద్యోగులకు రెంట్ తిరిగి చెల్లించాలి

ఉక్కునగరం: హెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న ఉద్యోగులకు రికవరీ చేసిన రెంట్‌ను తిరిగి చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ మిత్ర పక్షాల నాయకులు కోరారు. హెచ్‌బీ కాలనీలోని క్వార్టర్లలో ఉంటున్న ఉద్యోగులను ఖాళీ చేయిస్తున్న పరిస్థితుల్లో కార్మిక సంఘాలతో టౌన్ అడ్మిన్ జీఎం వై. చంద్రశేఖర్ ఆధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్వార్టర్లు ఖాళీ చేయాల్సి వస్తే వారికి హెచ్ఆర్ఏ ఇవ్వడంతోపాటు ఇప్పటికే రికవరీ చేసిన పీనల్ రెంట్‌ను తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, బీఎంకె నాయక్, వై.మస్తానప్ప, బొడ్డు పైడిరాజు, ఎస్.ఎ. నాయుడు, డి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.